పేదలకు గృహయోగం



టిడ్కో గృహ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు, స్థానిక నాయకులు

- సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్
- గొర్లివానిపాలెంలో 512 టిడ్కో గృహాల నిర్మాణం
- గృహ సముదాయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు
- ముఖ్యమంత్రికి మనసారా కృతజ్ఞతలు

టిడ్కో గృహ సముదాయం విశేషాలు

నిర్మించిన ప్రాంతం : పరవాడ సమీపంలోని గొర్లివానిపాలెం

నిర్మాణ విలువ : రూ.35.85 కోట్లు

16 బ్లాకుల్లో నిర్మించిన గృహాల సంఖ్య : 512

430 ఎస్ఎఫ్‌టీలో గృహ లబ్ధిదారులు : 160 మంది

365 ఎస్ఎఫ్‌టీలో గృహ లబ్ధిదారులు : 32 మంది

300 ఎస్ఎఫ్‌టీలో- గృహ లబ్ధిదారులు : 320 మంది

పరవాడ: ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పరవాడ సమీపంలోని గొర్లివానిపాలెం వద్ద ప్రభుత్వం రూ.35.85 కోట్ల వ్యయంతో నిర్మించిన 512 టిడ్కో గృహాల సముదాయాన్ని, ఎస్‌టీపీ ప్లాంట్‌లను స్థానిక సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి కనకారావు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో గృహ ప్రవేశాలను చేయించి ఇంటి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణానికి రూ.11 కోట్లను ఖర్చు చేయగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అదనంగా రూ.24.85 కోట్లను మంజూరు చేసి టిడ్కో గృహ సముదాయంలో ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించిందని తెలిపారు. ఒక్క రూపాయి రిజిస్ట్రేషన్‌తో ఉచితంగా లక్షల విలువైన సొంతింటి కలను నిజం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు లబ్ధిదారుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. 16 బ్లాకుల్లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో 430 ఎస్ఎఫ్‌టీలో-160 మంది, 365 ఎస్ఎఫ్‌టీలో-32 మంది, 300 ఎస్ఎఫ్‌టీలో-320 మంది లబ్ధిదారులకు గృహ వసతి కల్పించినట్లు చెప్పారు.

ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండ

ప్రతి పేదవాడికి ఏదో ఒక రూపంలో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకున్న సీఎం జగనన్న ఒక్కరేనన్నారు. వలంటీర్-సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, డ్వాక్రా రుణాల మాఫీ, రూ.2కే రేషన్ బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ తదితర పథకాలను ప్రజలు నేటికీ మరచిపోలేకపోతున్నారన్నారు.



పరవాడ సమీపంలోని గొర్లివానిపాలెం పేదలకు ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహ సముదాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రతిపక్షాలను నమ్మవద్దు

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను దోచుకోవడం తప్పా.. చేసిందేమీ లేదని అదీప్‌రాజ్ విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కల్లబొల్లి హామీలిచ్చి అధికారంలోకి రావాలని చూస్తున్నారని, వాటిని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పేదలు బాగుండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైన ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను కూడా పెద్ద మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. నూతన గృహ ప్రవేశాలు చేసిన ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. గృహాలు పొందిన లబ్ధిదారులందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనసారా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జెడ్పీ పి.సింహాచలం, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు కాసు అంజిరెడ్డి, చల్లా కనకారావు, టిడ్కో ఎస్ఈ నరసింహమూర్తి, టిడ్కో ఈఈ సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరింది



జగనన్న ప్రభుత్వంలో మా సొంతింటి కల నెరవేరింది. ఈ ప్రభుత్వం వల్ల అమ్మ ఒడి, మా తండ్రికి పింఛన్, తల్లికి అభయ హస్తం వంటి సంక్షేమ పథకాలు వర్తించాయి. మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నాం. ఆయన వెంటే నడుస్తాం. ఆయనొస్తేనే పేద, మధ్య తరగతి ప్రజలకు పూర్తిగా మేలు జరుగుతుంది. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని మేం మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

– ఫరజాన భానుఫేజ్, విశాఖ బురుజుపేట

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



నేను, నా భర్త నరసింగరావు దేశపాత్రునిపాలెంలో బార్బర్ షాపు అద్దెకు తీసుకుని నడుపుకుంటున్నాం. రోజువారి ఆదాయంపై ముగ్గురు ఆడ పిల్లలతో కాలం నెట్టుకొస్తున్నాం. పరవాడలో టిడ్కో గృహం కోసం నాలుగేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నాం. గృహం మంజూరైంది. అప్పట్లో నిర్మాణం పూర్తి కాలేదు. జగనన్న ప్రభుత్వంలో నా ఇంటి నిర్మాణం పూర్తైంది. చాలా సంతోషంగా ఉంది. టిడ్కో ఇల్లును మంజూరు చేసినందుకు జగనన్నకు జీవిత కాలం రుణపడి ఉంటాం.

– చిప్పాద లక్ష్మి, దేశపాత్రునిపాలెం

గృహ ప్రవేశంతో చాలా ఆనందంగా ఉంది



విశాఖ దరి అల్లిపురంలో చాలా కాలం నుంచి అద్దె ఇంట్లో నేను, భర్త, పిల్లలు నివసిస్తున్నాం. నా భర్త సాయిబాబా వెల్డర్‌గా పనిచేస్తూ తెచ్చిన ఆదాయంతో కాలం నెట్టుకొస్తున్నాం. చాలీచాలని ఆదాయంతో ఇంటి అద్దె కట్టలేక సతమతమవుతున్న తరుణంలో టిడ్కో ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాం. జగనన్న ప్రభుత్వం రాగానే టిడ్కో గృహాల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసి అందించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాతో గృహ ప్రవేశం చేయించి తాళాలను అందజేశారు. చాలా ఆనందంగా ఉంది.

– కాపు అరుణ, అల్లిపురం

మూగ జీవాలకూ.. ఆరోగ్య రక్ష

- 1962 సర్వీస్‌తో పాడి పశువులకు తక్షణ వైద్యసాయం
- ఒక్క ఫోన్‌కాల్‌తో గ్రామాలకు వెళ్తున్న పశు వైద్య సిబ్బంది
- పెందుర్తి నియోజకవర్గం పరిధిలో రెండు వాహనాలు
- ప్రతి వాహనంలో పశు వైద్యుడితో పాటు విధుల్లో మిగిలిన సిబ్బంది
- ఉచితంగా మందులు, వాక్సినేషన్
- ప్రతి పశువుకు సంరక్షణ కార్డుల పంపిణీ
- మండలంలో 22 వేల పాడి పశువులు



సబ్బవరంలోని ప్రాంతీయ పశు వైద్యశాల





సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాలలో కుక్కకు వైద్యం చేస్తున్న ఏడీ ఉషాకుమారి



అంతకాపల్లి పశు వైద్య కేంద్రంలో పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

సబ్బవరం : ప్రజలకే కాదు మూగజీవాల ప్రాణ రక్షణకు సైతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా పాడి పశువుల కోసం సంచార పశు వైద్యశాలలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో అత్యవసర సమయాల్లో పాడి రైతులు 1962 నంబర్‌కు కాల్ చేసి సంచార వైద్యశాలల సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఒక్క ఫోన్‌కాల్‌తో వాహనంతో పాటు వైద్యులు, సిబ్బంది హుటాహుటిన వెళ్లి మూగజీవాలకు అత్యవసర వైద్య సేవలు అందించడం ద్వారా వాటి ప్రాణాలు కాపాడేందుకు విశేష సేవలు అందిస్తున్నారు. ఈ సేవలపై మూగజీవాల పెంపకందారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని గ్రామాలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు పరవాడ, పెందుర్తి పశు సంచార వైద్యశాలలు అత్యవసర సేవలు అందిస్తున్నాయి. వాహన డ్రైవర్‌తో పాటు ఒక వైద్యుడు, సహాయకుడు సేవలందిస్తున్నారు. 108 సర్వీసుల మాదిరిగానే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఎవరైనా ఫోన్ చేస్తే కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం చేరి వైద్య బృందం ఘటనా స్థలానికి చేరుకుని మూగజీవాలకు వైద్య సేవలందిస్తున్నారు. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా సంరక్షణ కార్డులు సైతం పంపిణీ చేశారు. అనేక మందికి జీవనోపాధిగా నిలిచే పాడి పశువుల సంరక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపట్టారు.

మూగ జీవాలకు ఆరోగ్య నేస్తం..

మూగజీవాల ప్రాణ రక్షణ కోసం ఏర్పాటు చేసిన 1962 వాహనాలు ప్రస్తుతం గ్రామాల్లో ఆరోగ్య నేస్తాలుగా మారిపోయాయి. సంచార పశువైద్య సేవల ద్వారా ప్రాణాంతకమైన వ్యాధులకు సైతం చికిత్స అందిస్తున్నారు. పాము కాటుకు గురైన పశువులకు సత్వర వైద్యం అందిస్తుండటంతో మూగజీవాలు ప్రాణాపాయం నుండి బయట పడుతున్నాయి. అవసరమైన మందులు, వ్యాక్సినేషన్ భద్రపరిచేందుకు వాహనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్యాక్సిన్ స్టోరేజీ కోసం ప్రత్యేకంగా ఫ్రీజర్ బాక్స్‌లు సైతం అమర్చారు. దీంతో 1962 సర్వీసులు మూగజీవాల పాలిట ఆరోగ్య నేస్తంగా మారాయి.

పశు వైద్యశాలల సేవలు ఇలా..

- సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాలలో డాక్టర్ వైఎస్సార్ నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను నూతనంగా నిర్మించారు.
- సుమారు రూ.14 లక్షలతో నిర్మించిన ఈ ప్రయోగశాలను ఇటీవల స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు.
- మండలంలోని పలు గ్రామాల్లోని పాడి రైతులందరూ పేడ పరీక్ష, రక్త పరీక్ష, పొదుగు వాపు వ్యాధి, పాల పరీక్ష చేయడం ద్వారా సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి అనేక వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు.
- ఇది వరకు ఈ పరీక్షల కోసం పాడి పశువుల నుండి సేకరించిన నమూనాలను విశాఖలోని జిల్లా వ్యాధి నిర్ధారణ కేంద్రానికి తీసుకెళ్లాల్సి వచ్చేది.
- మిగిలిన ప్రాంతాల్లో అగ్రి ల్యాబ్‌కు అనుసంధానంగా ఈ వ్యాధి నిర్ధారణ కేంద్రాల నిర్మాణం జరుగుతోంది.

సకాలంలో వైద్యసేవలు..



మాకు ఒక ఆవు, రెండు పాడి గేదెలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పాడి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అదే విధంగా ఆరిపాక పశు వైద్య కేంద్రం పరిధిలోని మా గ్రామానికి పశువులకు అవసరమయ్యే అన్ని రకాల వైద్య సేవలు సకాలంలో అందిస్తున్నారు.

– బుద్దల గోవింద్, పాడి రైతు, రాయపుర అగ్రహారం, సబ్బవరం మండలం

సంచార వైద్యశాలల ద్వారా అత్యవసర సేవలు..



అత్యవసర పశు వైద్యసేవలకు 1962కు కాల్ చేసి సంచార వైద్యశాలల ద్వారా సేవలు పొందొచ్చు. ఆరిపాక, గుల్లేపల్లి, అంతకాపల్లిలోని పశు వైద్యశాలలు సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాలకు అనుబంధంగా పని చేస్తున్నాయి.

–డాక్టర్ ఉషాకుమారి, సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశు వైద్యశాల సబ్బవరం

సేవలపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



అంతకాపల్లి పశు వైద్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో పాడి పశువులకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నాం. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సంచార వైద్యశాలలపై పాడి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ స్వర్ణలత, పశు వైద్యురాలు, అంతకాపల్లి పశు వైద్య కేంద్రం

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం



జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, కర్రి బాబు తదితరులు

సబ్బవరం: మహాత్ముడు కలలు గన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని పైడివాడ అగ్రహారం సచివాలయం పరిధిలో సర్పంచ్ వద్దాది అప్పలరాజు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పైడివాడ అగ్రహారం సచివాలయం పరిధిలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. నవరత్నాలతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, నియోజకవర్గ ప్రతినిధి కోటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్‌లు వద్దాది అప్పలరాజు, సచివాలయ కన్వీనర్ పెచ్చేటి రమేష్ నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బలిరెడ్డి కనకరాజు, పెచ్చేటి దుర్గారావు, ఈవోపీఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లలితా పీఠంలో ధనుర్మాసోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మన్నవ కృష్ణసేన్

సీతంపేట: లలితానగర్‌లో లలితా పీఠంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతంలో భాగంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రతి రోజూ నిత్య కైంకర్యం, విశేష సేవలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు సుప్రభాతం, స్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన, శాతుపాశురాల విన్నపం, గోదా చతుశ్లోకి జరుగుతాయని తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 3న సహస్ర దీపాలంకరణ, 11న కూడారై ఉత్సవం, 14వ తేదీ భోగి రోజున గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

1036వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1036వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఘనంగా ఇంధన పొదుపు దినోత్సవం

గోపాలపట్నం: గోపాలపట్నం ఆదిత్య కళాశాలలో జాతీయ ఇంధన పొదుపు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కె.మురళీ మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. టీజీటీ పీఏపీఎస్ గణేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇంధనం గురించి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టులు తయారు చేసిన పలువురు విద్యార్థులకు అతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.ఇంద్రనీల్, ఫిజిక్స్ హెచ్‌వోడీ బి. శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 16, 17, 18 & 19వ తేదీలలో
కేరళ ఆయుర్వేద చికిత్స
గల కేరళ ఆయుర్వేద కేంద్రం
4 రోజులపాటు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్
చికిత్స అందిస్తారు.
అపాయింట్‌మెంట్ కొరకు 7675861446

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com

క్లుప్తంగా

అభాగ్యుడికి ఆర్థిక సాయం



డీఆర్‌వో మోహన్‌కుమార్ నుంచి చెక్కు అందుకుంటున్న కత్తి సుబ్రహ్మణ్యం

పెందుర్తి: మధుమేహ వ్యాధి కారణంగా కాలు తొలగించిన వ్యక్తికి కలెక్టర్ మల్లికార్జున గురువారం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. పెందుర్తికి చెందిన కత్తి సుబ్రహ్మణ్యం మధుమేహ వ్యాధితో బాధపడుతుండటంతో కాలు తొలగించడంతో వికలాంగుడిగా మారారు. తనను ఆర్థికంగా ఆదుకోవాలని, వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆశ్రయించారు. స్పందించిన కలెక్టర్ మానవతా దృక్పథంతో సంజీవిని నిధి నుంచి రూ.20 వేలు మంజూరు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ రూ.20 వేల చెక్కును సుబ్రహ్మణ్యానికి అందజేశారు.

శాస్త్రోక్తంగా పగల్‌పత్తు ఉత్సవాలు



పారాయణ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలు రెండో రోజు గురువారం శాస్త్రోక్తంగా కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేసి ఉదయం ఆలయ బేడా మండపంలో అయ్యవారి సేవను విశేషంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేశారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అయ్యప్ప పీఠాల నిర్మాణానికి విరాళాలు



గండివానిపాలెంలో అయ్యప్పను దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ: పెదముషిడివాడలోని పలు శివారు గ్రామాల అయ్యప్ప స్వాములు శాశ్వత పీఠాల నిర్మాణం కోసం సర్పంచ్ పల్లా నాగమణి కుమారుడు పల్లా అప్పారావు (కబడ్డీ) తన సొంత నిధుల నుంచి రూ.6.10 లక్షలను అందజేసినట్లు తెలిపారు. పెదముషిడివాడలో అయ్యప్పస్వామి శాశ్వత పీఠం నిర్మాణానికి రూ.4 లక్షలు, గండివానిపాలెంలో అయ్యప్ప స్వామి శాశ్వత పీఠానికి రూ.1.90 లక్షలు, నక్కవానిపాలెం అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహానికి రూ.20 వేలను విరాళాలుగా ప్రకటించారు. సదరు విరాళాలను సర్పంచ్ పల్లా నాగమణి ఆయా పీఠాల నిర్వాహకులకు గురువారం అందజేశారు. అయ్యప్ప పీఠాలకు విరాళాలు ప్రకటించిన కబడ్డీ అప్పారావును పలువురు ప్రసంశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నందవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సృజనాత్మకత

విశాఖ సిటీ: పుస్తక పఠనంతో పిల్లల్లో విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతాయని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. టర్నర్‌చౌల్ట్రీలో జరుగుతున్న విశాలాంధ్ర బుక్ హౌస్ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వీ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, ద్వారకానగర్ రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. సీనియర్ విభాగంలో రవీంద్ర భారతి స్కూల్ ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, మధురానగర్ జీవీఎంసీ హై స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఈవో లక్ష్మీప్రసన్న బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, వీ డెంటల్ హాస్పిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డ్, డెంటల్ కిట్లు అందజేశారు. క్విజ్ మాస్టర్లుగా ప్రసన్న కుమార్, నవ్య సిరికి, కె.పృథ్వీరాజ్ వ్యవహరించారు. వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

ఉన్నత లక్ష్యాలకు బాటలు



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన ఈ వేడుకల్లో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా వర్సిటీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీని ఆధారంగా చేసుకుని తమ ఉన్నత భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార్య జి.వీర్రాజు, ఆచార్య పి.ప్రేమానందం, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.